మిస్టర్ సీఎం.. వేర్ ఆర్ యూ స్లీపింగ్?

- డిసెంబర్ 9 పోయి ఎన్ని రోజులాయె?
- రైతులను బ్యాంకోళ్లు ఇబ్బంది పెడుతుండ్రు.. రుణమాఫీ ఏది?
- సీఎంకు ఢిల్లీ యాత్రలే సరిపోతున్నయ్
- ప్రభుత్వంపై కేసీఆర్ ఆగ్రహం

హైదరాబాద్, మార్చి 31(నమస్తే తెలంగాణ): 'కాంగ్రెస్ హామీ ఇచ్చిన రుణమాఫీ ఏమైంది, డిసెంబర్ 9 దాటి ఎన్ని రోజులైంది?' అని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నదని, ముఖ్యమంత్రి ఎక్కడ నిద్రపోతున్నారని ప్రశ్నించారు. ఆదివారం ఎండిన పంటలను పరిశీలించిన కేసీఆర్ అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. '' ఈ ముఖ్యమంత్రి ఎన్నికలకు ముందు రుణమాఫీపై ఏం చెప్పారో అందరికీ తెలుసు. కేసీఆర్ కొంత మాఫీ చేశారు కదా, ఇగ బ్యాంకులకు లగెత్తండి. పరుగెత్తండి రూ. 2 లక్షల రుణం తెచ్చుకోండి. డిసెంబర్ 9 నాడు మొత్తం మాఫీ చేస్తా అన్నడు. 'వెన్ డిసెంబర్ 9 యాన్ గాన్ మిస్టర్ చీఫ్ మినిస్టర్.. వేర్ ఆర్ యూ స్లీపింగ్. ఐయామ్ ఆస్కింగ్ యూ. బ్యాంకోళ్లు వచ్చి పైసలు కట్టమని రైతులను అడుగుతున్నారు. 'సార్ రేవంత్‌రెడ్డి డిసెంబర్ 9న మాఫీ చేస్తమన్నడు కదా' అని చెబితే బ్యాంకు వాళ్లు మాత్రం 'రేవంత్‌రెడ్డి గీవంత్‌రెడ్డి జాన్తా నై. అవన్నీ మాకు సంబంధం లేదు. నువ్వు కట్టాల్సిందే. ప్రభుత్వాన్ని మాకు డబ్బులు ఇవ్వమనండి. అప్పుడు మేం వసూలుకు రాం' అని చెబుతున్నారు. రుణాలు చెల్లించాలని నోటీసులు ఇచ్చి రైతులను సతాయిస్తున్నారు. రూ. 2 లక్షల రుణమాఫీ ఏమైంది? ఎప్పుడు చేస్తరో ఎందుకు చెప్పడం లేదు? రైతులకు బ్యాంకులు నోటీసులిస్తే ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు ఎందుకు మాట్లాడడం లేదు? వీటికి సమాధానం కావాలి. రైతులు, ప్రజల పక్షాన అడుతున్నాం. మీ ఇష్టమొచ్చిన వాగ్దానాలు చేసి, ప్రజలను గోల్‌మాల్ చేసి కేవలం 1.8 శాతం ఓట్లతో గట్టెక్కి ప్రభుత్వంలోకి వచ్చారు. మిమ్మల్ని ఎట్లా ఒదిలిపెడుతాం. తరిమితరిమి కొడుతాం. నిద్రకూడా పోనివ్వం.

పంటలు ఎండి రైతులు నష్టపోతే.. సీఎం ఢిల్లీ యాత్రలా

ఈ ప్రభుత్వం ఏదీ పట్టించుకోకుండా, దేనిపైనా సమీక్షలు చేయకుండా అడ్డగోలు మాటలు, పిచ్చి ప్రచారాలు చేసుకుంట ఎంతసేపూ గత ప్రభుత్వాన్ని బదనాం చేయాలనే చీప్ ట్యాక్టిక్స్ తప్ప ఏమీ కనపడతలేదు. ఆనాడు ఖమ్మంతోపాటు అనేక జిల్లాల్లో రాళ్లవాన వచ్చి పంటనష్టం జరిగింది. ఆనాడు పరిహారం కోసం కేంద్రానికి నివేదిక పెట్టాలె. రైతుల పరిస్థితి దిగజారకూడదని చరిత్రలో ఎప్పుడు లేనివిధంగా నేను ఎకరానికి రూ. 10వేల చొప్పున ఇచ్చాను. ఆ పొలంలోనే అప్పటికప్పుడు ప్రకటించి ఐదారు రోజుల్లోనే రైతులకు రూ. 149 కోట్లు అప్పుడు పంపిణీ చేశాం. ఇలా పలు దఫాలుగా సుమారు రూ. 500 కోట్లు రైతులకు నష్ట పరిహారం పంచినం. ఇవాళ రాళ్లవాన పడితే అడిగే దిక్కులేదు. ఒక మంత్రి పోడు, ఒక ఎమ్మెల్యే పోడు. ఎంపీపోడు, దొంగలు ముఖం చాటేసినట్టు. ముఖ్యమంత్రికి పట్టలేదు. ఆయనకు ఢిల్లీయాత్రలే సరిపోతున్నయ్. అధికారుల బృందాలను పంపరు.

కరెంటు వాడుకునే తెలివిలేదు

- మాపోళ్లు పాల్గొనే సభల్లోనూ కరెంటు పోతున్నది
- కరెంటు పోయినప్పుడల్లా 'జై కాంగ్రెస్' అని హేళన చేస్తున్నా చీమకుట్టినట్టు లేదా?
- విద్యుత్తుపై మా హయాంలో 35 వేల కోట్లు ఖర్చు చేశాం
- అన్ని రంగాలకు కరెంటు ఇచ్చాం
- రాజకీయాలకు తీరిక ఉంది కానీ, రైతుబంధు వేసేందుకు లేదా?
- ప్రభుత్వంపై కేసీఆర్ ఆగ్రహం

అసెంబ్లీలో మగాళ్ల లెక్క ఉపన్యాసాలు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

హైదరాబాద్, మార్చి 31(నమస్తే తెలంగాణ): అసెంబ్లీలో కరెంటుపై పెద్ద మగాళ్ల లెక్క ఉపన్యాసాలు ఇచ్చారని, కరెంటు కోసం అప్పులు చేశామని చెప్పారని, ఎవరి కోసం అప్పులు చేశామని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రశ్నించారు. అప్పు చేసి కరెంటు కొన్నది రైతుల కోసమేనని స్పష్టంచేశారు. ఆదివారం పలు జిల్లాల్లో ఎండిన పంటలను పరిశీలించిన కేసీఆర్ అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. '' ఆనాడు నేను గంట సేపు అసెంబ్లీలో ఉపన్యాసం చెప్పిన. పీక్ అవర్స్ వచ్చినప్పుడు రెండు మూడు నెలల పాటు నెలకు రూ.14 వందల కోట్లు పెట్టి ఎంత షార్టేజ్ ఉంటే అంత కొనుక్కొచ్చి ఇచ్చినం. అందుకే ఆనాడు రెప్పపాటు సమయం కూడా కరెంటు పోలేదు. మేము ఉన్నప్పుడు పీక్‌లోడ్ 14,900 మెగావాట్ల పైచిలుకు పోయింది. మొన్న పీక్‌లోడ్ 15,600 మెగావాట్లకు పోయింది. ఓ ఐదారొందలు పెరిగిందంతే. అది కూడా మీరు కొనడం లేదు. కొంత కొంటున్నా, రైతులకు అవసరమైన మేర పవర్ కొనడం లేదు. కాబట్టే కరెంటు రావడం లేదు. మొన్నటి వరకు దర్జాగా ఉన్న మోటార్లు ఇప్పుడెందుకు కాలుతున్నయ్? ఒక రోజులో ఐదారుసార్లు కరెంటు వస్తూ పోవడం వల్లనే మోటార్లు కాలుతున్నయ్. అక్కడక్కడ మావోళ్లు సభలల్లో మాట్లాడుతున్నా కరెంటు పోతున్నది. జగదీశ్‌రెడ్డి నల్లగొండ సభల్లో మాట్లాడుతుంటే ఐదుసార్లు కరెంటు పోయింది. కరెంటు పోయినప్పుడల్లా కింద కూర్చునోళ్లు 'జై కాంగ్రెస్' అని హేళన చేస్తున్నరు. అయినా మీకు చీమ కుట్టినట్టు లేదు బాధలేదు.

ఉన్నది ఉన్నట్టు నడిపించలేని అసమర్థత

రాష్ట్రం వచ్చాక సంవత్సరంలోనే అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్‌రంగాన్ని సుమారు రూ.35వేల కోట్లు ఖర్చు పెట్టి, రకరకాల పద్ధతులను అవలంబించి, సెంట్రల్ ఎలక్ట్రిసిటీని సంపద్రించి అద్భుతమైన కరెంటును తెచ్చిపెట్టినం. దేశంలో అన్ని రంగాలకు 24గంటల కరెంటు ఏర్పాటు చేసిన ఘనత మా ప్రభుత్వానిది. అనాడు కరెంటు పోతే వార్త. ఇయ్యాల కరెంటు ఉంటే వార్త. ఏడున్నర, ఎనిమిదేళ్లు కమర్షియల్, డొమెస్టిక్, అగ్రికల్చర్, ఐటీ, మరే ఇతర రంగమైనా ప్రజలందరికీ 24/7 కరెంటును అద్భుతంగా సప్లయ్ చేసిన రాష్ట్రం దేశంలో తెలంగాణ. అగ్రగామి రాష్ట్రం. దానికి ఏం చెదలు పట్టింది. 100 రోజుల్లో ఇంత అస్తవ్యస్తం ఏంది? ఉన్న తమాషా ఏంది? కొత్తగా నడిపించేది ఏం లేదు. కొత్తగా మొద్దులు మోసేది లేదు. కట్టెలు కొట్టేది లేదు. కొత్తగా గడ్డపారలు పట్టి తవ్వేదిలేదు. ఉన్నది ఉన్నట్టు నడిపించలేని అసమర్థత ఏంది? కట్టిన ఇల్లు, పెట్టిన పొయ్యి కదా. దానిని నడిపించే తెలివి లేకపోతే ఎట్లా? దీనిని బట్టి మనకు స్పష్టంగా అర్థమైతున్నది ఏందంటే ఇప్పుడు రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న పార్టీ, ప్రభుత్వం అసమర్థత, అవివేకం. తెలివితక్కువ తనం. ఉన్న కరెంటును వాడుకునే తెలివిలేదు. ఉన్న మిషన్ భగీరథను వాడుకునే తెలివి లేదు. హైదరాబాద్‌కు అద్భుతంగా నీళ్లు, మళ్లా ఐదేండ్ల వాటర్ బిల్లులు వస్తున్నయ్.

కరెంటు గోస అలా తీర్చినం

హైదరాబాద్‌కు ఇండస్ట్రీలో, ఐటీ రంగంలో అద్భుతమైన పెట్టుబడులు వస్తున్న తరువాత హైదరాబాద్‌ను పవర్ ఐలాండ్ సిటీగా మార్చినం. ఎటువంటి పరిస్థితి వచ్చిందంటే పెద్దపెద్ద ఐటీ కంపెనీలు, ఇంటర్నేషన్ దిగ్గజాలు న్యూయార్క్‌లో పోతది, లండన్‌లో పోతది పవర్. కానీ హైదరాబాద్‌లో పోదు అని చెప్పేటట్టు చేసినం. అధికారంలోకి వచ్చిన కొత్తలో రాష్ట్రం నేషనల్‌గ్రిడ్‌తో అనుసంధానం లేకుండె. వెంటపడి నేషనల్‌గ్రిడ్‌తో అనుసంధానం చేయించినం. దాని ఫలితం ఏమంటే మనకు ఏదయినా సందర్భంలో లోటు ఏర్పడితే దేశంలో ఎక్కడి నుంచైనా పవర్‌ను కొనుక్కునే అవకాశాన్ని కల్పించాం అది నెంబర్1. ఇక నెంబర్2 7600 మెగావాట్లగా ఉన్న ఇన్‌స్టాల్డ్ విద్యుత్ కెపాసిటీని దాదాపు 18,000 మెగావాట్లకు తీసుకుపోయాం. దానికి అదనంగా రామగుండంలో 1600, యాదాద్రి థర్మల్ స్టేషన్‌లో 4000 మెగావాట్లు, మొత్తంగా 5600 మెగావాట్ల సామర్థ్యం వచ్చేలా సదుపాయాలు కల్పించాం. నేనే పదిసార్లు రామగుండం వెళ్లి, వాళ్ల వెంటపడి దానిని కంప్లీట్ చేయించినా. మొన్ననే ఎన్టీపీసీని ప్రధానమంత్రి మోదీ స్వయంగా ప్రారంభించినరు. ఆ సప్లయ్ కూడా ఇప్పుడు యాడ్ అయింది. యాదాద్రిలో కూడా ఒకటో, రెండో యూనిట్లు వచ్చే అవకాశముండె. ఇది మన సొంతం. దీంట్లనుంచి ఒక్క యూనిట్‌ను కూడా బయటకు ఇచ్చే అవసరం లేదు. మరి ఎందుకు ఈ రోజు ఇబ్బంది పడతా ఉంది? ఇది పరిపాలకుల అసమర్థత అవునా? కాదా? అనేది మీరే ఆలోచన చేయాలె. ఇది పనిచేయలేనటువంటి, పని చేయ చేతగానటువంటి అసమర్థ ప్రభుత్వం విధానం అనకోవాలా?. ఏవిధంగా అర్థం చేసుకోవాలి. దరిద్రం ఉందంటే అర్థం చేసుకోవచ్చు. ఉండి దరిద్రం ఎందుకు?ఇంత అద్భుతమైన పవర్ సిస్టం ఎందుకు ఫెయిల్ అవుతున్నది? ఏడేండ్లు అందరికీ అందుబాటులో ఉన్న కరెంటు స్విచాఫ్ చేసినట్లుగా ఎందుకు మాయమైంది. దీనికి ఎవరు సమాధానం చెప్పాలి?'' అని కేసీఆర్ ప్రశ్నించారు.

కరెంటు కష్టాలకు అసమర్థ, తెలివితక్కువ కాంగ్రెస్ కారణం

యూ ఆస్క్ యువర్ ఓన్ హార్ట్. ఏడేండ్లు బ్రహ్మాండంగా నడిచిన కరెంట్ సిస్టం మూడు నెలల్లోనే నడవకుండా పోయిందంటే ఇది ఎవరి అసమర్థత. ఇది నూటికి నూరు శాతం అసమర్థ, అవివేక, తెలివితక్కువ కాంగ్రెస్ పార్టీ అసమర్థత మాత్రమే. మేము ఆనాడు పవర్ సిస్టంలో మొత్తం ఐఏఎస్ ఆఫీసర్లను తొలగించి టెక్నోక్రాట్స్‌ను పెట్టి నడిపాం. మాకు తెలివిలేక కాదు. ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్ట్రిబ్యూషన్ సిస్టంలో నూటికి నూరు శాతం టెక్నోక్రాట్స్‌నే నియమించాం. ఎలా నడపాలో వారికి తెలుసు కాబట్టి అప్పుడు సమర్థవంతంగా నడిచింది. ఇప్పుడు అందరు ఐఏఎస్ ఆఫీసర్లను తెచ్చిపెట్టారు. వాళ్లకు పట్టదు. మంత్రులకు పట్టదు. వాళ్లకు రాజకీయాల కోసం తీరికలు ఉన్నాయి కానీ ప్రజల అవసరాల కోసం తీరికలు లేవు. రైతుబంధు వేయడానికి తీరిక లేదు. మేము రైతుబంధు వేస్తే వారం పది రోజుల్లోనే పూర్తిగా వేసేవాళ్లం. గరిష్ఠంగా 12 రోజుల్లో అందరు రైతులకు డబ్బు పడిపోయేది. ఇప్పుడు ఐదు ఎకరాలని, మూడెకరాలని, ఏడెకరాలని అనుమానాలు కలిగించి ఏదో విజయం సాధించినట్టు, తోక మట్ట, పెద్ద కథ చేసినట్టు, అదేదో గొప్ప డంబాచారమన్నట్టు, ఇష్టారీతిగ మాట్లాడుతున్నరు.

రామగుండం థర్మల్ స్టేషన్ బీఆర్ఎస్ తెచ్చిందే

రామగుండం 4 వేల మెగావాట్ల థర్మల్ స్టేషన్ ఆనాడు శాంక్షన్ చేయించింది మేము. దాంట్లో కేంద్రం 1600 మోగావాట్లు ఇమ్మీడియేట్‌గా చేసిస్తామని కావాల్సిన సదుపాయాలు ఇవ్వమన్నారు. అప్పుడు నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ఎల్లంపల్లి నుంచి వాటర్ అలకేట్ చేసినం. భూమి కేటాయించినం. పర్మిషన్ ఇచ్చినం. పనులు మొదలుపెట్టారు. అయినా ఆలస్యమైంది. 1600 మోగావాట్లు యాడ్ అయ్యింది. మేమున్నప్పుడే ఇచ్చింద్రు. మేం పీపీఏ చేస్తేనే కదా పనులు, వర్క్స్ స్టార్ట్ చేసింది. మేం ఆరోజే పీపీఏ చేసినం. ఇట్ సెల్ఫ్ ఈజ్ ఏ అగ్రిమెంట్. కొత్తగా చేయ్యాల్సింది ఏం ఉండదు. కమిషన్ ఆపరేషన్ డేట్ (సీవోడీ) అనేది రోటీన్ ప్రాసెస్. ఫార్మల్ లెటర్. మొన్ననే ప్రధానమంత్రి వచ్చి కమిషన్ చేసిండు. గవర్నమెంట్ అనేది కంటిన్యూయస్ ప్రాసెస్.

రైతు భారం తాను మోస్తూ..

తుంటికి గాయమై నడించేందుకు ఎదురవుతున్న ఇబ్బందిని సైతం ఓర్చుకొని కేసీఆర్ రైతుల కోసం కదిలారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఆసరాగా చేసుకొని, చేతికర్ర ఊతంగా చేసుకొని పొలం గట్లపై కదులుతూ కర్షకులకు భరోసా కల్పించారు. ఆదివారం జనగామ జిల్లా దేవరుప్పల మండలం ధరావత్ తండా వద్ద కనిపించిన దృశ్యమిది.

ఎకరాకు 25 వేలు ఇవ్వాల్సిందే

ఇచ్చేవరకు విడిచిపెట్టేది లేదు

- 15 లక్షల ఎకరాల్లో పంటలు ఎండినై
- రైతుల పాలాలు మీరే ఎండబెట్టారు
- ప్రతి ఎకరాన్ని లెక్కించాల్సిందే
- వందకు 100% పరిహారం కక్కిస్తాం
- పంటల పరిశీలన అనంతరం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

హైదరాబాద్, మార్చి 31(నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా ఎండిన పంటలకు ప్రతి ఎకరాకు రూ. 25వేల నష్ట పరిహారం ఇవ్వాలని బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు పరిహారం ఇచ్చేవరకు ప్రభుత్వాన్ని వెంటాడుతామని హెచ్చరించారు. ఇప్పటికే కాంగ్రెస్ తెచ్చిన కరువుతో 15 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. ఈ మేరకు ఎండిన పంటలను పరిశీలించిన అనంతరం సూర్యాపేటలో కేసీఆర్ విలేకరులతో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే.. ''రైతుల పంటలెండుతుంటే గుడ్డిగుర్రాల పండ్లు తోముతున్నారా? మీరు రైతులు కాదా? ఎండేవి పంటలు కాదా? మీకెవరికీ పట్టింపు లేదా? రైతుల తరపున ప్రశ్నించేటోళ్లు ఎవ్వరూ లేరనుకుంటున్నారా? ఒక మహా సముద్రమంత బీఆర్ఎస్ ఉన్నది. ఎట్టి పరిస్థితుల్లో వందకు వందశాతం రైతుల పక్షాన పోరాటం చేస్తాం. మీ అసమర్థత వల్ల పొలాలు ఎండిపోయినవి కాబట్టి.. వెంటనే జిల్లా కలెక్టర్లకు ఆదేశాలిచ్చి పంటలను లెక్కించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా. ఏ గ్రామంలో ఏ రైతు పంట ఎంత ఎండిందో లెక్క తీయాలి. ధరలు పెరిగి రైతులకు భారమైంది కాబట్టి రూ. 25వేలు ప్రతి ఎకరాకు, ప్రతి రైతుకు చెల్లించాలి. ఇది చేసేంత వరకూ మిమ్మల్ని వెంటాడతం, వేటాడతం, ధర్నాలు చేస్తాం. నిద్రపోనివ్వం. మంత్రులు, ఎమ్మెల్యేలను గ్రామాల్లో నిలదీస్తాం. ప్రజాస్వామ్యంలో మాకు అడిగే హక్కు ఉంటుంది ప్రధాన ప్రతిపక్ష పార్టీగా మేము దానికి న్యాయం చేయాలి. రాష్ట్రంలో మా బీఆర్ఎస్ దళాలు తిరుగుతున్నయి. మేము కూడా ఎన్యూమరేట్ చేస్తున్నాం. మా మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు తిరుగుతున్నరు. మీకు చేతగాకపోతే కచ్చితంగా అన్ని లెక్కలు తీస్తాం. మిమ్మల్ని బజాట్లోకి ఈడుస్తాం. వందకు వందశాతం మీ చేత రైతులకు పరిహారం కక్కిస్తాం. ఆనాడు మేమిస్తే మీరు ఎకరెక్కాలాడిర్రు. ఇయ్యాల మేము డిమాండ్ చేస్తున్నాం. ఎండిపోయిన ప్రతి ఎకరాకు 25వేలు పరిహారం ఇవ్వాల్సిందే.

కాంగ్రెస్ అసమర్థత వల్లే..

నేను బరువైన గుండెతో ఎందుకు చెబుతున్నానంటే ఒక్క ఎకరం ఎండని తెలంగాణలో మీ అసమర్థత వల్ల 15-16 లక్షల ఎకరాల పంటలు ఎండబెట్టారు. పంట పెట్టంగనే ఎండిపోతే అదొక దరిద్రం. కానీ మీరు సగంసగం నీళ్లు ఇస్తరని నమ్మి పెట్టుబడులు పెట్టిర్రు పాపం రైతులు. ఎల్కారం గ్రామంలో ఓ మహిళ నాతో చెప్పుకొని ఏడ్చింది. 'నీళ్లు ఇస్తమన్నరు సార్. పంట పెట్టుకున్నాం. రెండుమూడు తడులకు ఇచ్చింద్రు. మేము గవర్నమెంట్‌ను నమ్ముకొని పంట పెట్టుకుంటే మధ్యలో బంజేసిండ్రు. మా పంటలు ఆగమైనయ్' అని 15 వందల ఎకరాలు చూపెట్టింది. నేను వస్తున్నానని పేపర్లలో వార్తలు రాగానే కాల్వలల్లో తెల్లారిందాక నీళ్లు వదిలారు. మొన్న నీళ్లు విడువడం ఎందుకు? ఓ 15 రోజుల ముందు విడిస్తే బాగుండు కదా. చివరి రెండు తడులు లేక ఎండిపోయిన పంటలుండె కదా..

నేడు యాడ పండుకున్నరు

ఏది ఏమైనా, రణరంగమైనా సరే ఈ ప్రభుత్వం మెడలు వంచుతాం. మేము రూ.పదివేల నష్టపరిహారం ఆనాడు ఇచ్చాం. ఇన్‌స్టంట్‌గా ప్రకటించి రూ. 500 కోట్లవరకు పంచినం. మేము ఆనాడు రూ. 10వేలు నష్ట పరిహారం ఇస్తే దాన్ని కూడా ఎకసెక్కం చేసి మాట్లాడినారు. ఏ మూలకి సరిపోద్ది పదివేలు, రూ. 20వేలు ఇవ్వాలి అని మాట్లాడినారు. మరి ఇయ్యాల యాడ పండుకున్నరు. తలకాయ ఎక్కడ పెట్టుకున్నరు. ఏమి చేస్తున్నరు' అని కేసీఆర్ ప్రశ్నించారు.

ఆగమైతున్న రైతులకు నేనున్నా!

- భరోసా కల్పించిన కేసీఆర్
- సర్కారు మెడలు వంచి పరిహారం ఇప్పిస్తానని బీఆర్ఎస్ అధినేత రణ నినాదం
- కన్నీరు ఇంకిన రైతుల్లో కొత్త ఉత్సాహం

మిన్నంటిన జై తెలంగాణ.. జై కేసీఆర్ నినాదాలు

> జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గంలోని ధరావత్‌తండాలో కేసీఆర్ పర్యటిస్తుండగా, జై తెలంగాణ.. జై కేసీఆర్ అని ప్రజలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రాష్ట్ర సర్కారు తీరుపై విమర్శనాస్త్రాలు సంధిస్తూ రైతులు ప్లకార్డులు ప్రదర్శించారు. 'తక్షణమే కాల్వల ద్వారా చెరువులు నింపాలి, రూ.2 లక్షల రుణమాఫీ చేయాలి, రాజకీయాలు మనకు వద్దు.. రైతులను ఆదుకోవడమే ముద్దు, 24 గంటలు కరెంట్ ఇవ్వాలి' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతుబంధు రాలేదని ఆవేదన చెందారు. పంటకు సరిపడా నీళ్లు ఇస్తామంటేనే వరినాట్లు వేశామని, లేదంటే మక్కజొన్నో, పజ్జొన్నో వేసేవాళ్లమని రైతులు, చివరికి కౌలు రైతులు కూడా తమ గోడును వెల్లబోసుకున్నారు. నీళ్లు లేక ఎండినోరు తెరచిన తమ పొలాన్ని, వాలిపోయి పేలిపోయిన వరిగొలుసులను కేసీఆర్‌కు చూపించి రైతులు విలపించారు.

హైదరాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ): పంటలెండి గుండెచెదిరిన రైతన్నకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భరోసా ఇచ్చారు. సర్కారు మెడలు వంచుదామని పిడికిలెత్తారు. మండుటెండను లెక్కచేయక ఎండిన వరిపొలాలను పరిశీలించారు. రైతు భుజంతట్టి అభయమిచ్చారు. పార్టీ అధినేత తమ ప్రాంతానికి వస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరికి వారు దారిపొడవునా స్వాగతం పలికారు. మహిళలు మంగళహారతులు పట్టారు. ఆదివారం కేసీఆర్ ఎర్రవెల్లిలోని తన వ్యవసాయ క్షేత్రం నుంచి బయలుదేరి జనగామ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో పంటపొలాలను పరిశీలించారు. రైతులను కలిసి వారి కష్టసుఖాలను తెలుసుకున్నారు. దుఃఖంలో ఉన్న రైతులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

దారిపొడవునా గులాబీ నీరాజనం

ఎర్రవెల్లి నివాసం నుంచి బయలుదేరిన అధినేతకు అడుగడుగునా జనం నీరాజనాలు పలికారు. ఎర్రటి ఎండను లెక్కచేయక రోడ్డుకు ఇరువైపులా నిలబడి జై తెలంగాణ.. జై కేసీఆర్ అంటూ పార్టీ కార్యకర్తలే కాకుండా సామాన్యప్రజలు తమ అభిమానాన్ని చాటుకున్నారు.యాదాద్రి-భువనగిరి, జనగామ జిల్లాల సరిహద్దు అయిన పెంబర్తిలో, జనగామ, సూర్యాపేట జిల్లాల సరిహద్దు అయిన తిరుమలగిరిలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున గుమిగూడి కేసీఆర్‌పై పూలవర్షం కురిపించారు.

ఎర్రవల్లి నుంచి తోడ్కొని..

కేసీఆర్ తమ ప్రాంతంలోని రైతులకు బాసటగా నిలిచేందుకు వస్తున్న నేపథ్యంలో జనగామ జిల్లా నేతలు కేసీఆర్‌ను స్వాగతం పలికేందుకు నేరుగా ఎర్రవెల్లిలోని వారి వ్యవసాయక్షేత్రానికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా నేతలు వెళ్లి ఆహ్వానించారు. కేసీఆర్‌తోనే వారు పయనమయ్యారు. అక్కడి నుంచి ఆలేరు నియోజకవర్గంలోని తుర్కపల్లి, జనగామ నియోజకవర్గంలోని పెంబర్తి, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలోని లింగాలఘనపురం, దేవరుప్పుల మీదుగా సూర్యాపేట జిల్లాకు సరిహద్దుకు చేరుకోగానే మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ తదితరులు కేసీఆర్‌కు స్వాగతం పలికారు. తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని అర్వపల్లి, వెలుగుపల్లి గ్రామాల్లో ఎండిన పంటలను పరిశీలించారు. ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో కేసీఆర్ మధ్యాహ్న భోజనం చేశారు. అక్కడి నుంచి సూర్యాపేట పార్టీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అక్కడి నుంచి తిరిగి ఎర్రవెల్లికి చేరుకున్నారు.

నీళ్లు ఆగినయ్.. కన్నీళ్లు పెరిగినయ్

- కాంగ్రెస్ పాలనలో 280 మంది రైతుల ఆత్మహత్య
- బారాణా మందికి నిలిపేసేలా రైతుబంధుపై కుట్ర
- కాంట్రాక్టర్లకేమో వేల కోట్ల బిల్లులు మంజూరు చేస్తరా?
- కామారెడ్డి మీటింగ్‌లో హరీశ్‌రావు
- ప్రజల గొంతుకగా నిలుస్తా: గాలి అనిల్‌కుమార్

కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం లింగంపల్లి ఖుర్దులో ఎండిన పంటలను పరిశీలించి, బాధిత రైతులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

నిజామాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ పాలనలో సాగునీళ్లు తగ్గి, రైతులకు కన్నీళ్లు పెరిగాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆ పార్టీ అధికారంలోకి వస్తూనే కరువును తీసుకొచ్చిందని విమర్శించారు. కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అధ్యక్షతన నిర్వహించిన జహీరాబాద్ లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఫేక్ వార్తలు, లీకు వార్తలతో ప్రజలను గందరగోళానికి గురిచేసే కుట్రలకు కాంగ్రెస్ పాల్పడుతున్నదని మండిపడ్డారు. నాలుగు నెలల పాలనలో రాష్ట్రంలో 280 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. వరి పంట కోతకు వచ్చినా ఇంకా రైతుబంధు పడలేదని తెలిపారు. బారాణా మందికి రైతుబంధును నిలిపేసేందుకు కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు. పంటలకు బోనస్ ఇచ్చాకే కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లోకి రానివ్వాలని ప్రజలకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చే సాయాన్ని ఆపి, కాంట్రాక్టర్లకు ఆర్థికశాఖ ద్వారా బిల్లులు దోచి పెడుతున్నదని విమర్శించారు. పంటలు ఎండిపోతున్నా, రాళ్ల వానతో పంటలు నష్టపోతున్నా ఒక్క కాంగ్రెస్ మంత్రికి రైతులను పరామర్శించే తీరిక లేకపోవటంపై తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. మోసపూరిత కాంగ్రెస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్‌పై వ్యతిరేకత: పోచారం

దేవుడిలాంటి కేసీఆర్‌కు ఎందుకు ఓటు వేయకపోతిమి అని ప్రజలు బాధ పడుతున్నారని మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సాధారణంగా ప్రభుత్వం ఏర్పడ్డాక 3-4 ఏండ్లకు ప్రజల్లో వ్యతిరేకత వస్తుందని, కానీ కాంగ్రెస్ సర్కారుపై 4 నెలలకే వ్యతిరేకత వచ్చిందని వెల్లడించారు.

ప్రజల గొంతుకగా నిలుస్తా: గాలి అనిల్

జహీరాబాద్ ఎంపీగా రెండుసార్లు బీబీపాటిల్ గెలిచినా ఈ ప్రాంతాన్ని ఏనాడూ పట్టించుకోలేదని బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ విమర్శించారు. తాను ప్రజల గొంతుకగా నిలుస్తానని చెప్పారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, హన్మంత్ షిండే, జాజాల సురేందర్, మాజీ ఎమ్మెల్సీ జనార్దన్‌గౌడ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

సమావేశం ప్రారంభంలోనే కరెంట్ కట్

నిజాంపేట, మార్చి 31: మెదక్ జిల్లా నిజాంపేటలోని ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హరీశ్‌రావు హాజరై స్టేజీపైకి వచ్చి మాట్లాడుతుండానే కరెంట్ పోయింది. దీంతో ఫంక్షన్‌హాల్ సిబ్బంది వెంటనే జనరేటర్‌ను ఆన్ చేయటంతో సమావేశం కొనసాగింది.

ఎండిన పంటల పరిశీలన

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో మాజీ మంత్రులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, హరీశ్‌రావు పర్యటించారు. జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, గంప గోవర్ధన్, హన్మంత్ షిండేతో కలిసి ఎండిన పంట పొలాలను పరిశీలించారు. రైతులు తమ కష్టాలు చెప్పుకొని కన్నీటి పర్యంతమయ్యారు.

వంద రోజుల్లోనే ఎవుసం ఆగమైంది

- అన్నదాతను దగా చేసిన కాంగ్రెస్ సర్కారు